క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం

అర్ధవీడు: మండలంలోని కాకర్ల గ్రామంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ×బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ× కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్ధవీడు మండల ముఖ్య నాయకులు, జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షను మెంబర్లు, మండల కన్వీనర్, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రామయ్య తాతకు ప్రత్యేక పూజలు

అర్ధవీడు: స్థానిక అంకభూపాలెం, పాపినేనిపల్లె గ్రామాల్లో రామయ్య తాతకు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు ఇంటికో బిందె నీటిని తీసుకెళ్లి గ్రామ వీధుల్లో వారుపోశారు. అనంతరం రామయ్య తాతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. వర్షాలు కురవాలని పూజలు చేశారు. కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి పొంగళ్లు

మండలంలోని బొల్లుపల్లి, అచ్చంపేట గ్రామాల్లో ఆదివారం పోలేరమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా పోలేరమ్మకు పూలమాలలు వేసి పూజలు చేయడంతోపాటు పొంగళ్లు సమర్పించారు.

ఘనంగా పోలేరమ్మతల్లికి పూజలు



మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లి దేవస్థానంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు పోలేరమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణం నుంచే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘ నాయకులు

బేస్తవారిపేట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త బొంతల లక్ష్మణ స్వామి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా వాగిచర్ల మారుతీ ప్రసాద్, యువజన సంఘ అధ్యక్షుడిగా మిచ్చనగట్ల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని ఆర్యవైశ్య సంఘ పెద్దలు ఘనంగా సన్మానించారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

గిద్దలూరు రూరల్: ప్రజలపై అధిక భారాన్ని మోపే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మండల విస్తృత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో చేదైన స్మార్ట్ మీటర్లు ఈ ప్రభుత్వంలో తీపెలా అయ్యాయని ప్రశ్నించారు. సామాన్యులకు షాక్ ఇచ్చి అదానికి మేలు చేసే స్మార్ట్ మీటర్లను ఎక్కడికక్కడ అడ్డుకోవాలన్నారు. ట్రూఅప్ చార్జీలు, అదనపు చార్జీలు, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, జి.విశ్రాంతమ్మ, నరసింహులు, సాయి, మేరి, రంగయ్య, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి నవోదయలో సీటు



మార్కాపురం: మండలంలోని బోడపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి కర్ర యజ్ఞధర్‌రెడ్డి జవహర్ నవోదయలో సీటు పొందినట్లు పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థి తండ్రి మల్లారెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్ షారిక్ మొదటి లిస్టులోనే సీటు పొందాడని, మూడో లిస్టులో యజ్ఞధర్‌రెడ్డికి అడ్మిషన్ లభించిందని వివరించారు.



పూర్తిగా చినిగిపోయిన బ్యాగ్‌లు



ఆటోలో పుస్తకాలు తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

- నెలన్నరకే చినిగిపోయిన స్కూల్ బ్యాగులు
- సొంత బ్యాగులతో పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు
- పనిచేయని జిప్‌లు, తెగిపోయిన హ్యాండిల్, అడుగు భాగానికి చిల్లు
- నేటికీ పూర్తి స్థాయిలో సరఫరా కాని పాఠ్య పుస్తకాలు, విద్యామిత్ర కిట్లు

స్కూల్ బ్యాగ్‌ల నాణ్యత డొల్ల

బేస్తవారిపేట: సంక్షేమ పథకాల అమలులో కూటమి సర్కారు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. ఆర్భాటపు ప్రచారాలు తప్ప సక్రమంగా ఏదీ నిర్వహించడం లేదు. ప్రభుత్వ బడుల్లో చిన్నారులకిచ్చిన బ్యాగుల నాణ్యతలో ప్రభుత్వ డొల్లతనం కనపడుతోంది. విద్యార్థులకిచ్చిన బ్యాగులు మూన్నాళ్లకే చిరిగిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నేటికీ పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో సరఫరా చేయకపోవడంతో పేద విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు నాణ్యమైన బ్యాగులు ఇచ్చామంటూ ప్రగల్బాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం డొల్లతనం క్రమంగా బయటపడుతోంది. విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసి కనీసం పట్టుమని నెలన్నర కాకముందే బ్యాగులు చినిగిపోవడంతో మూలన పడేసి, సొంత బ్యాగులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. మరికొందరు విద్యార్థులకు ఇచ్చిన బ్యాగులకు కుట్లు ఊడిపోవడం, జిప్‌లు ఫెయిల్ కావడంతో పిన్నీసులు పెట్టుకుని పాఠశాలలకు తీసుకెళ్తున్న దుస్థితి. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏదో చేసేస్తున్నామంటూ కూటమి సర్కారు మాయ మాటలు చెబుతూ ఇంత అధ్వాన్నంగా నాసిరకం బ్యాగులను సరఫరా చేయడం దారుణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. నెలరోజులకే దాదాపు 35–45 శాతం మంది విద్యార్థులు తమ సొంత బ్యాగులను పాఠశాలలకు తీసుకెళ్తున్నారు.



హాండిల్ వద్ద చినిగిపోయిన బ్యాగ్‌లు

నేటికీ పంపిణీకి నోచుకోలేదు..

పాఠశాలలు తెరవకముందే పాఠ్య పుస్తకాలు, విద్యామిత్ర కిట్లను మండల కేంద్రాలకు పంపాల్సిన ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు తగినంతగా సరఫరా చేయలేదు. దీంతో పాఠశాలల్లో నూతన అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కిట్లు అందలేదు. మూడు రోజుల క్రితం మళ్లీ అరకొరగానే పాఠ్యపుస్తకాలను మాత్రమే ఎంఈఓ కార్యాలయాలకు పంపారు. కిట్లు మాత్రం సరఫరా చేయలేదు. నెలన్నర రోజులుగా పుస్తకాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రచారం ఏమో విపరీతంగా చేసుకుంటూ విద్యార్థులకు సరిపడా పుస్తకాలు, బ్యాగులు కూడా అందించడం లేదంటూ తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

పది రోజులకే బ్యాగ్ చినిగింది



కొత్తగా ఇచ్చిన బ్యాగ్ క్వాలిటీ మరీ దారుణంగా ఉంది. బ్యాగ్ ఇచ్చిన పది రోజులకే చినిగిపోయింది. ఇప్పటికే ఒకసారి కుట్టించుకున్నా. బ్యాగ్ ఊరకనే చినిగిపోతోందని కొన్ని పుస్తకాలే తీసుకెళ్లినా మళ్లీ చినిగిపోయింది. మా నాన్నను అడిగి కొత్త బ్యాగ్ కొనుక్కున్నా.

– సందీప్, జెడ్పీ బాలుర హైస్కూల్, బేస్తవారిపేట

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు!

రాచర్ల: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో డంపింగ్ యార్డులు కీలకం. అధికారులు నిర్లక్ష్యంతో లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు వృథాగా మారుతున్నాయి. చాలా చోట్ల అంసాఘిక కార్యక్రమాలకు అడ్డంగా నిలుస్తున్నాయి. రాచర్ల మండలంలోని పాలకవీడు పంచాయతీ పరిధిలోని ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే దారిలో డంపింగ్ యార్డు ఉంటే చెత్త అనుమలవీడు–గౌతవరం రహదారి పక్కనే పడేస్తున్నారు. ఆ చెత్తకు నిప్పు పెడుతుండటంతో దాని నుంచి వెలువడే పొగతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లో వేయకుండా ఆరుబయట తగలబెడుతుండటంతో కాలుష్యం పెరిగిపోతోంది. ఆహార వ్యర్థాల వద్ద వీధి కుక్కలు చేరడంతో అటుగా వెళ్లాలంటేనే గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ ప్రధాన రహదారుల వెంట చెత్త వేయడం ఏమిటని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే.



అనుమలవీడు గ్రామ శివారులో రోడ్డు పక్కనే చెత్తకు నిప్పు



ఓబుల్‌రెడ్డిపల్లెలో నిరుపయోగంగా డంపింగ్ యార్డు



డంపింగ్ యార్డులో ఖాళీగా దర్శనమిస్తున్న ఎరువు తయారీ తొట్లు

మహిళలను విస్మరిస్తే పుట్టగతులుండవు

- మహిళా విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరుణమ్మ

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రజలనే కాకుండా మహిళలను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసం చేశారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణమ్మ అన్నారు. ఆదివారం ఆమె ప్రకటనలో తెలియజేస్తూ ఎన్నికల ముందు ఎన్నో అబద్దపు వాగ్దానాలు చేసి వాటిని నిలపెట్టుకోవడం లో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలి అని అన్న మంత్రి అచ్చెన్నాయుడు ఉద్దేశం, వాటి వెనుక ఉన్నమర్మం ఏమిటని ఆమె ప్రశ్నించారు. కేవలం మహిళకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బూటకపు మాటలు అంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి ఇంటింటా తిరుగుతూ బాండ్లు రాసిచ్చారని గుర్తు చేశారు. తీరా అధికారం చేపట్టగానే వాటిని అమలు చేయకుండా సహచర మంత్రులతో పథకాలు ఇవ్వలేమంటూ సుద్దపూస మాటలు చెప్పడం మహిళలను మరో మారు మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడబిడ్డ నిధి పథకం ద్వారా 19–50 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని ఎన్నికల ప్రసంగాల్లో ఉదరగొట్టి ఇప్పుడు అడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాలంటూ మంత్రి అన్నారంటే ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనం అన్నారు. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారం చేపట్టిన తరువాత పథకాలు అమలు సాధ్యం కాదని చెప్పడం మహిళా లోకాన్ని మోసం చేయడమే నన్నారు.







గిద్దలూరులో అధిక లోడుతో ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలు

లోడ్ బండి.. ప్రమాదమండి!

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో కొందరు వాహనదారులు పరిమితికి మించిన లోడ్‌తో ప్రమాదకరమైన ప్రయాణం కొనసాగిస్తున్నారు. పట్టణంలోని రాచర్లగేటు సెంటర్, కుమ్మరాంకట్టసెంటర్, గాంధీబొమ్మసెంటర్, గణేష్‌నగర్, కొప్పువారివీధి, పెద్దబజారు, గర్రెవారివీధి, క్లబ్‌రోడ్డు, పెద్ద మార్కెట్‌వీధి, పాములపల్లెగేటు సెంటర్, చిన్నమార్కెట్ వీధుల్లో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రదేశాల్లోకి అధిక లోడ్ గల వాహనాలు వచ్చినపుడు ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వ్యాపార సముదాయాల వద్ద లోడ్ బండ్లు ఆగిన సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రమేష్

కంభం: హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ విమర్శించారు. స్థానిక జీఆర్ఆర్ అండ్ టీపీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం వాటిని విస్మరించిందన్నారు. ప్రజలకు నిత్యావసరంగా మారిన విద్యుత్‌ను ఆసరాగా చేసుకుని కార్పొరేట్లు దోచుకునేందుకు స్మార్ట్‌మీటర్లకు తెరలేపడంతోపాటు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల రుపాయాల భారాన్ని మోపడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకరించారని, నేటి విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆనాడు 'స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి టిడిపి మీకు అండగా ఉంటుంద'ని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. స్మార్ట్‌మీటర్లను తొలగించాలని, విద్యుత్ భారాలను తగ్గించాలని, సెకీ ఒప్పందాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు అన్వర్ బాష, నాయబ్ రసూల్, అబ్రహం, తిరుపతయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట:

మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

అంకాళమ్మతల్లి ఆలయానికి భూమి పూజ

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామంలో అంకాళమ్మతల్లి ఆలయ నిర్మాణానికి ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి భూమిపూజ చేశారు. గ్రామస్తుల సహకారంతో అంకాళమ్మతల్లి ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని ఉడుముల పేర్కొన్నారు. పోలేరమ్మతల్లి ఆలయ ప్రహరీ నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు ఏలూరి సంజీవరెడ్డి, మారావతు వెంకటేశ్వర్లు, గ్రామ కమిటీ సభ్యులు కంది శ్రీను, కోనంకి నగేష్, మోరా రమణారెడ్డి, శ్రీనాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

యల్లమ్మతల్లికి విశేష పూజలు

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలోని నాగారపు యల్లమ్మతల్లి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర, సారెతోపాటు నైవేద్యాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం పచ్చగా ఉండాలని అమ్మవారిని గ్రామస్తులు వేడుకున్నారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



యల్లమ్మతల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

కంభం: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శప్రాయుడని యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు, మాజీ సైనికులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు

తాళ్లూరు:

మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం కావడంతో ఏకువజామున నుంచే జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట,నాగ శిలలు, మల్లికార్జున స్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో గుంటి గంగా భవానీ అమ్మ